క్లుప్తంగా

ఇంటింటా వైఎస్సార్‌సీపీ ప్రచారం



ఇంటింటికి జగనన్న సందేశం కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఆత్మకూరు: పట్టణంలోని 7వ వార్డులో కౌన్సిలర్ నౌషాద్‌బేగం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ బూత్ కమిటీ మేనేజరు సయ్యద్ జమీర్, తదితరులతో కలిసి ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు తిరిగి అమలు కావాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లనే సాధ్యం అవుతుందన్నారు. ఆయన ఆశీర్వాదంతో ఆత్మకూరులో పోటీ చేస్తున్న మేకపాటి విక్రమ్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి అఫ్రీన్, సయ్యద్ రెహానా పాల్గొన్నారు.

స్థలం ఆక్రమించారని తహసీల్దార్‌కు ఫిర్యాదు

ఉదయగిరి: దుత్తలూరు సెంటర్‌కు సమీపంలోని 565వ జాతీయ రహదారి పక్కన సర్వే నంబరు 91లో సుమారు 50 సెంట్ల స్థలాన్ని ఐదేళ్ల క్రితం మాదిగ భవనం నిర్మాణం కోసం చదును చేసిన స్థలాన్ని కొందరు ఆక్రమించి కంచె వేశారని మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ యశోదకు ఫిర్యాదు చేశారు. స్థలానికి ఉత్తరం వైపు ఉన్న భూ యజమానులు వారి గట్టుపై ఉన్న కంప చెట్లు తొలగించి తాము చదును చేసిన స్థలాన్ని సైతం ఆక్రమించి కంచె వేశారన్నారు. ఈ విషయమై ప్రశ్నిస్తే తమపై దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గొల్లపల్లి శ్రీనివాసులు, గొల్లపల్లి మోహన్‌రావు, గంగపట్ల సింహాద్రి, బర్రె అర్జున్, కొసినిపోగు రవి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న ప్రసాద్

ఉదయగిరి: పట్టణంలోని అరుంధతీయవాడకు చెందిన పాదిలి తిరుపాలు ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులను మంగళవారం ఏపీ ఎమ్మార్పీఎస్ ఉదయగిరి నియోజకవర్గ అధ్యక్షుడు నల్లిపోగు ప్రసాద్ పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఆర్థిక సాయమందించారు. ఈ కార్యక్రమంలో గడ్డం బాబు, ఎర్రగుడ్ల బాబు, నాగిళ్ల మనీష్ పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు దేహ దానం




సుబ్బనాచారి (ఫైల్)

ఉదయగిరి: పట్టణంలో ప్రముఖ వైద్యుడు సుబ్బనాచారి పార్థీవ దేహాన్ని ఆయన కుటుంబ సభ్యులు మంగళవారం నెల్లూరులోని వైద్య కళాశాలకు దానం చేశారు. సుబ్బనాచారి మంగళవారం మృతి చెందారు. ఆయన ఆకాంక్ష మేరకు కుమారుడు వేణుగోపాల్ తండ్రి సుబ్బనాచారి పార్థివదేహాన్ని నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ అనాటమీ డిపార్ట్‌మెంట్‌కు ఇచ్చారు. తన తండ్రి మరణించినా.. వైద్య విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఉండాలని కోరారని, ఆ మేరకు వైద్య కళాశాలకు అందించామని కుమారుడు వేణుగోపాల్ తెలిపారు.

మతిస్థిమితం లేని యువకుడు హల్‌చల్

ఉదయగిరి: పట్టణానికి చెందిన ఓ యువకుడు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో పలువురిపై దాడి చేసిన ఘటన మంగళవారం పంచాయతీ బస్టాండ్ సమీపంలో జరిగింది. అతను వీధుల్లో నగ్నంగా తిరుగుతూ కనిపించిన వారిని కొట్టడం, బిగ్గరగా అరవడం చేస్తుండడంతో పలువురు వారించేందుకు ప్రయత్నించగా వారిపై దాడి చేశాడు. దీంతో ఎట్టకేలకు యువకులు అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేసి బంధించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

బైక్ అదుపు తప్పి గాయాలు



సోమశిల: బైక్ అదుపు తప్పి పడి ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన అనంతసాగరం మండలం పడమటికంభంపాడు ఇసుక రీచ్ సమీపంలో మంగళవారం జరిగింది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన మణి వరికోత యంత్రం వద్ద ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. పనిపై బైక్‌లో వెళ్తుండగా అదుపు తప్పి గాయపడ్డారన్నారు. ఎస్సై సుబ్బారావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స చేయించి అనంతరం 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సమరానికి సిద్ధం

- రేపు ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభం
- మూడేళ్లలో ముప్ఫై ఏళ్ల అభివృద్ధి సాధించిన 'విజనరీ'
- రూ.వేల కోట్ల విలువైన రామాయపట్నం, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ఘనతే
- ఐదేళ్లలో రూ.1,482 కోట్లతో జనావాసాల్లో మౌలిక వసతులు
- రూ.1,200 కోట్ల మేర సంక్షేమ పథకాలతో ప్రజలకు ఆర్థిక భరోసా

రవ్వంత చేసి కొండంత చెప్పుకునే నేటి రాజకీయాల్లో.. ఎంతో చేసినా పిసరంత చెప్పుకోని, ప్రచారం చేసుకోని నేత కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి. ఆహార్యంలో సింప్లిసిటీ. మాటల్లో, చేతల్లో నిజాయితీ. సామాన్యుల నుంచి శ్రీమంతుల వరకు అందరిలో ఒకడిగా కలిసిపోయే వ్యక్తిత్వం. అదే ఆయన్ను రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపు తీరానికి చేర్చింది. అధికారంలో ఉన్న ఐదేళ్లలో రెండేళ్లు కరోనా కష్టకాలం మినహాయిస్తే.. మిగిలిన మూడేళ్లల్లోనే ముప్ఫై ఏళ్ల అభివృద్ధిని సాధించిన విజనరీ. కావలి నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో మరోసారి ఎన్నికల క్షేత్రంలో సమరానికి 'సిద్ధం' అవుతున్నారు. గత రెండు దఫాలు ఎన్నికల ప్రచారం సెంటిమెంట్ ప్రకారమే గురువారం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు.

కావలి : బెంగళూరులో రూ.వేల కోట్ల వ్యాపారాలు వదులుకుని తన పుట్టిన ఊరైన కావలికి ఏదైనా చేయాలనే సంకల్పంతో ప్రతాప్‌కుమార్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చాడు. రాజకీయాల్లో తలపండిన మహామహులే రెండో సారి గెలవడం దుర్లభం. అటువంటి కావలి నియోజకవర్గంలోని ప్రజల ఆదరాభిమానాలు పొందడంతోనే జనం వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు. 2014లో ఎమ్మెల్యేగా గెలిచినా పార్టీ అధికారంలోకి రాకపోవడంతో ఏమీ చేయలేకపోయాడు. కావలి అభివృద్ధి ప్రణాళికకు పోరాటం చేశాడు. అదే ఆయనపై ప్రజల నమ్మకాన్ని పెంచింది. 2019 ఎన్నికల్లో ఆయనపై నమ్మకంతో గతానికి మించిన మెజార్టీతో మళ్లీ గెలిపించారు. ఆ క్షణం నుంచి కావలిని కనకపట్నంగా మార్చే ప్రాజెక్ట్‌ల్లో రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, దగదర్తి ఎయిర్‌పోర్టుతో పాటు కావలి ఇండస్ట్రియల్ కారిడార్, కావలి పెద్ద చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, కావలి ట్రంక్ రోడ్డు విస్తరణ లక్ష్యాలతో ముందుకు సాగారు. కోవిడ్ కారణంగా రెండేళ్ల పాటు



జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్

కాలం వృథా అయినా లెక్క చేయలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో తనకున్న వ్యక్తిగత పరిచయం, సీఎంఓ అధికారుల సమన్వయంతో ఈ ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి చొరవ తీసుకున్నాడు. ప్రతిపాదనలను కార్యరూపం దాల్చేలా చకచకా పనులు ముందుకు సాగేలా ప్రయత్నాలు ప్రారంభించారు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్ పనులను సాధించుకువచ్చాడు. అంతే వేగంతో పనులు జరిగేలా



రామాయపట్నం పోర్టు

చూశారు. దేశంలో ఇప్పటి వరకు జరగనంత వేగంగా పోర్టు, హార్బర్‌లు పూర్తి చేయించాడు.

ఇండస్ట్రియల్ హబ్‌తో ఉద్యోగావకాశాలు

రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్‌కు అనుబంధంగా కావలి తీర ప్రాంతంలో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు చకచకా అన్నీ ప్రణాళికలు సిద్ధం చేయించారు. ఇప్పటికే భూసేకరణ ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఎన్నికల తర్వాత ఇండస్ట్రియల్ హబ్ కార్యరూపం దాల్చనుంది. దామవరం ఎయిర్‌పోర్టు కోసం చేయని కృషి లేదు. టీడీపీ హయాంలో జరిగిన అక్రమాలు, చేసిన పాపాలు ఎయిర్ పోర్టుకు అడ్డంకిగా మారినా ఓపికగా అధికారులను ఒప్పించి, తరలిపోయిన విమానాశ్రయ ప్రతిపాదనలను మళ్లీ దామవరం వచ్చేలా చేశాడు.

సీఎంను మెప్పించి.. ఒప్పించి..

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇదే కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి వరంగా మారింది. కావలి నియోజకవర్గ అభివృద్ధికి తన కార్యాచరణ లక్ష్యాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి మెప్పించి.. ఒప్పించి రూ.వేల కోట్లు ప్రాజెక్ట్‌లకు, రూ.వందల కోట్లు మౌలిక వసతుల అభివృద్ధికి రాబట్టగలిగారు. జగనన్న కాలనీలు, నాడు–నేడు కింద పాఠశాలల నిర్మాణం, కొత్త అర్బన్ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీలు, పాత ఆస్పత్రుల అభివృద్ధి, సీసీ రోడ్లు ఇలా.. ఎన్నో అభివృద్ధికి సుమారు రూ.1,482 కోట్లు నియోజకవర్గానికి సాధించాడు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా రూ.1200 కోట్లకు పైచిలుకు నేరుగా పేదలకు అందేలా కృషి చేశారు.

మరోసారి గెలిపిస్తే..

పెండింగ్ ప్రాజెక్ట్‌లు పూర్తి కావడంతో పాటు, పారిశ్రామిక కారిడార్‌తో కావలి కనకపట్నంగా మారుతుందని కావలి నియోజకవర్గ ప్రజలు నిర్ణయానికి వచ్చారు. దశాబ్దాలుగా ఏ నేత సాధించలేని ప్రగతిని సాధించిన చరిత్రను మూటకట్టుకున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై అన్ని వర్గాల ప్రజలు ఆశలు పెంచుకున్నారు. గత రెండు దఫాలు తన గెలుపు సెంటిమెంట్‌ను అనుసరించి గురువారం తీర ప్రాంతంలోని పెద్దపట్టపుపాళెం పంచాయతీలోని నందెమ్మపురం గ్రామ దేవత నందెమ్మ అమ్మవారికి దగ్గర నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు.

నాయీబ్రాహ్మణుల ఆత్మగౌరవం జగనన్న



నాయీ బ్రాహ్మణ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలోని నాయీబ్రాహ్మణుల ఆత్మగౌరవం కోసం నిజాయితీగా, నిబద్ధతతో కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, రానున్న ఎన్నికల్లో నాయీ బ్రాహ్మణులు అండగా ఉండాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని వాయునందనప్రెస్ వీధిలో మంగళవారం కావలి నియోజకవర్గ స్థాయిలో నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల ట్రస్టు బోర్డు సభ్యుల నియామకాల్లో నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి ఒకరికి తప్పని సరిగా స్థానం కల్పించాలని జగనన్న నిర్ణయించారని గుర్తు చేశారు. అనాదిగా ఆలయాల వ్యవస్థలో అర్చకులతో పాటు నాయీ బ్రాహ్మణులకు విడదీయరాని బంధం ఉందన్నారు. ఆలయాల్లో భాజాభజంత్రీలుగా, క్షురకులుగా, ప్రత్యేక ఉత్సవాల సమయంలో స్వామి వారి ఊరేగింపు పల్లకి సేవల్లో నాయీ బ్రాహ్మణులు పాత్ర కీలకమన్నారు. అటువంటి నాయీ బ్రాహ్మణులు టీడీపీ హయాంలో అవమానాలు ఎదుర్కొన్నారు. ఆలయాల నిర్వహణలో తమకు తగిన స్థానం కల్పించాలని కోరిన నాయీ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులను అధికారంలో ఉండగా చంద్రబాబు తీవ్రంగా అవమానించారని గుర్తు చేశారు. నాడు సచివాలయంలో తనను కలిసి సమస్యలు వినిపించిన సంఘాల నేతలనుద్దేశించి 'తోకలు కత్తిరిస్తా.. ఆలయాల మెట్లు కూడా ఎక్కకుండా చేస్తా' అంటూ చంద్రబాబు తీవ్ర స్వరంతో హెచ్చరించారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే నాయీబ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించిన విషయాన్ని మరవొద్దన్నారు. నాయిబ్రాహ్మణులను కించ పరిచేలా కులదూషణను నిషేధిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేసి దేశ చరిత్రలో నాయీ బ్రాహ్మణులకు అరుదైన గౌరవం దక్కేలా చేశారన్నారు. బీసీలను ముఖ్యంగా నాయీ బ్రాహ్మణులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుని అనంతరం, వారి సంక్షేమాన్ని విస్మరించిన టీడీపీని నమ్మొద్దన్నారు. నాయీ బ్రాహ్మణుల ఆత్మగౌరవంగా నిలిచిన జగనన్నకు మీరంతా అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవడానికి తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కావలి నియోజకవర్గంలో నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి కట్టుబడి ఉంటానని, ఎల్లవేళలా తాను నాయీ బ్రాహ్మణుల సంక్షేమ కోసం సహకరిస్తానని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర, జిల్లా, స్థానిక నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు ఓటేయండి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: అభివృద్ధి, సంక్షేమం, విశ్వసనీయతకు పట్టం కట్టాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రజలను కోరారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన చూశామని, 14 ఏళ్ల అధికారంలో ఉండి కూడా తాను చేసిన గొప్ప కార్యక్రమం ఏమిటో ఒక్కటీ చెప్పుకోలేని దుస్థితిలో ఉన్న చంద్రబాబు పరిపాలనను చూశామన్నారు. మండలంలోని వాశిలిలో మంగళవారం రాత్రి విజయీభవయాత్ర పేరుతో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో రెండు ఎస్సీ కాలనీలు, ఎస్టీ కాలనీతో పాటు పురవీధుల్లో పర్యటిస్తూ ప్రజలకు జరిగిన మేలును వివరించారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాలు పథకాల ద్వారా ఐదేళ్ల కాలంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను తెలియజేశారు. ఒక్క వాశిలి పంచాయతీ పరిధిలోనే వివిధ పథకాల ద్వారా 4,643 మంది లబ్ధిదారులకు రూ.13.28 కోట్ల నిధులు అందజేశామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రూ.40 లక్షల వ్యయంతో 12 అభివృద్ధి పనులు చేపట్టామని, 83 మందికి ఇంటి నివేశన స్థలాలు అందజేశామని, 33 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందించామన్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో ప్రతి



వాశిలి ఎస్సీ కాలనీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

లబ్ధిదారుడు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజల మనస్సు గెలుచుకోలేని టీడీపీ సహా దుష్ట చతుష్టయ కూటమి జగన్‌మోహన్‌రెడ్డిని అప్రతిష్ట పాలు చేసేందుకు ప్రతినిత్యం పడరాని పాట్లు పడుతున్నారన్నారు. ప్రజల నుంచి వస్తున్న జనాదరణ చూస్తే ముఖ్యమంత్రి జగన్ చెప్పినట్లుగా 175కు 175 స్థానాలు, వైఎస్సార్‌సీపీ కైవశం చేసుకోవడం ఖాయమని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అయితే ఎవరి విశ్వసనీయత ఏమిటో, ప్రజలపై ఏ నాయకుడికి నిబద్ధత ఉందో విచక్షణతో ఆలోచించి రానున్న ఎన్నికల్లో ఓటేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిట్టమూరు జితేంద్రనాగ్ రెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, ఏఎస్‌పేట ఎంపీపీ బోయిళ్ల పద్మజారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సానా వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర వైద్యశాల ఎండీ డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ చౌదరి, ఆత్మకూరు మున్సిపల్ మైనార్టీ నాయకులు జమీర్, స్థానిక సర్పంచ్ చెలిక రమ, వైఎస్సార్‌సీపీ నాయకులు చెలిక హరిబాబు, బొడ్డు పేరపనాయుడు, గిరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు దుత్తలూరులో విజయ సంకల్పయాత్ర

ఉదయగిరి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయ సంకల్పయాత్ర నిర్వహిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు బ్రహ్మేశ్వరం పంచాయతీలో, సాయంత్రం ఐదు గంటలకు ఏరుకొల్లు పంచాయతీలో, ఆరు గంటలకు బండకిందపల్లి పంచాయతీలో విజయ సంకల్పయాత్ర జరుగుతుందన్నారు. నేతలు, కార్యకర్తలు, అభిమానులు జయప్రదం చేయాలని కోరారు.

1వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఉచిత ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న పిల్లలు, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల పిల్లలకు విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం ఉచితంగా విద్యను అందించాల్సి ఉందన్నారు. ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దాఖలు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

కలిగిరి: కలిగిరిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని బుధవారం ఉదయం 10 గంటలకు ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రారంభిస్తారని జెడ్పీటీసీ పాలూరి మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి మంగళవారం తెలిపారు.

ఆక్రమణలపై ఫిర్యాదు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని జలవనరుల శాఖ (ఇరిగేషన్) చెందిన స్థలాల్లో మసీదు, చర్చి, గుడి వంటివి కట్టే ప్రయత్నాలు జరుగుతుండడంతో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఇరిగేషన్‌శాఖ అధికారులు మంగళవారం తెలిపారు. గత వారం పట్టణంలోని సర్వే నంబర్లు 898, 900లో నిర్మాణాలు చేస్తుండగా ఇరిగేషన్ శాఖ అధికారులు వాటిని అడ్డుకుని ప్రభుత్వ స్థలాలుగా బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే మంగళవారం ఆ స్థలాల్లో బోర్డులు తొలగించి మళ్లీ నిర్మాణ ప్రయత్నాలు చేస్తుండడంతో ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రలోభాలకు, అసత్యాలకు లొంగొద్దు



సీతారామపురంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మేకపాటి

- వైఎస్సార్‌సీపీని గెలిపించుకుంటేనే మీకు సంక్షేమం
- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

సీతారామపురం (ఉదయగిరి): ఎన్నికల్లో అవసరాల కోసం అబద్ధాలు చెబుతూ ప్రలోభాలకు గురి చేసే వారిని నమ్మొద్దని, మీ సంక్షేమాన్ని కాంక్షించి ఐదేళ్లు మీ అభివృద్ధికి పాటుపడిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రజలను కోరారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలన్నారు. మండలంలోని సోంపల్లి, బెడుసుపల్లి, నెమళ్లదిన్నె, గంగవరం, జయపురం, నాగరాజుపల్లి, మారంరెడ్డిపల్లి, దేవిశెట్టిపల్లి గ్రామాల్లో మంగళవారం విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా పౌరసేవలు ప్రజల వద్దకు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 58 నెలల జగన్ పాలనలో రెండేళ్లు కరోనాతో ఇబ్బంది పడినా రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి, సంక్షేమం ఆగిపోలేదన్నారు. 14 ఏళ్లు సీఎంగా చంద్రబాబు పాలనలో పెత్తందారులకే మేలు జరిగింది తప్ప పేదలకు ఒనగూరింది ఏమీ లేదన్నారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే ఈ సార్వత్రిక కురుక్షేత్ర ఎన్నికల్లో ఎవరి ప్రభుత్వంలో మంచి జరిగిందో ఆలోచించి విలువైన ఓటును వినియోగించుకోవాలన్నారు. మంచి చేసిన వారినే ఆశీర్వదించాలని రాజగోపాల్‌రెడ్డి అభ్యర్థించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రతిపక్ష టీడీపీ డబ్బుతో ఓట్లు కొనే ప్రయత్నం చేస్తుందని, దానిని తిప్పికొట్టి రాజన్న బిడ్డకు అండగా నిలవాలని కోరారు. టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ఈ ఎన్నికల తర్వాత అమెరికాకు వెళ్లడం ఖాయమన్నారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి విదేశాల్లో వ్యాపారాలు చేసుకుంటూ ఉంటారని, అలాంటి వ్యక్తికి ఓటేస్తే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఉదయగిరి ఎమ్మెల్యే తనను, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు. అంతకు ముందు సీతారామపురంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. విజయ సంకల్ప యాత్రలో ప్రతి గ్రామంలో ప్రజలు హారతులిచ్చి బొట్టు పెట్టి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి, ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, జెడ్పీటీసీ చెరుకుపల్లి రమణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పీసీ అల్లూరురాజు, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు వెంకట్రామిరెడ్డి, దుగ్గయ్య, వెంకటరెడ్డి, పి.మాబయ్య, కె.ఎలీషాకుమార్, పి.రామచంద్రయ్య, పి.లక్ష్మి, ఆర్.సుధాకర్‌నాయుడు, చింతనబోయిన దుగ్గయ్య, చప్పిడి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కీలక నేత వైఎస్సార్‌సీపీలో చేరిక

కావలి: పట్టణంలోని 17వ వార్డు టీడీపీ ముఖ్య నేత, మాజీ వార్డు ఇన్‌చార్జి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు పులిమి రామిరెడ్డి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. కావలిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పులిమి రామిరెడ్డి మాట్లాడుతూ కావలి అభివృద్ధి చెందాలన్నా.. ప్రశాంతంగా ఉండాలన్నా.. ఇక్కడే పుట్టి పెరిగి, కావలి ప్రజల సోదరుడిగా అన్ని వర్గాల ప్రజల మనసులను గెలుచుకున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నాయకత్వాన్ని మరో 20 ఏళ్ల పాటు కాపాడుకోవాలన్నారు. కావలి నియోజకవర్గ ప్రజల ఆశలు, ఆకాంక్షలపై సంపూర్ణ అవగాహన ఉన్న ఎమ్మెల్యే వల్లనే



పులిమి రామిరెడికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి రూపురేఖలు మారాయన్నారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పలకా వెంకటేశ్వరరెడ్డి, నంబూరి వెంకటేశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి, వేమిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెక్ పోస్టుల్లో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

వరికుంటపాడు: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మద్యం, డబ్బు, తదితరాలు రవాణా కాకుండా నియంత్రించేందుకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లోని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి చెప్పారు. ఆయన మంగళవారం వరికుంటపాడు పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన అనంతరం సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 18 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. 26 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. ఇప్పటికే వాహన తనిఖీల్లో చెక్‌పోస్టుల వద్ద నగదు, మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. సిబ్బంది నిష్పక్ష పాతంగా వ్యవహరించాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ వెంకటరమణ, సీఐ గిరిబాబు, ఎస్సై తిరుపతయ్య ఉన్నారు.

చెక్‌పోస్టులో ఎస్పీ తనిఖీ

మర్రిపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. చెక్‌పోస్టు నుంచి వెళ్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 18 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు రూ.10 కోట్ల వరకు అక్రమ నగదు పట్టుకున్నట్లు తెలిపారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద ఎస్సై స్థాయి అధికారి పర్యవేక్షణ ఉంటుందన్నారు. సిబ్బంది చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట ఆత్మకూరు సీఐ జీ వేణు, మర్రిపాడు ఎస్సై విశ్వనాథ్‌రెడ్డి ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి

సంగం: నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిలను ఆశీర్వదించాలని సంగం వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి కోరారు. సంగం శ్రీనివాసనగర్, శివాజీ సెంటర్‌ల్లో మంగళవారం ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో జరిగిన అభివృద్ధిని తెలుపుతూ సంక్షేమ ప్రభుత్వాన్ని మరో సారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రబాబు, రామారావు, జహంగీర్, వేణు, శివ, కరుణాకర్ తదితరులు ఉన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీ నేతల ప్రచారం

సోమశిల: అనంతసాగరంలో వైఎస్సార్‌సీపీ నేత బత్రెడ్డి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యుడిగా విజయసాయిరెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిలను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలకు ఉత్తర కాలువ ద్వారా మెట్ట పొలాలకు నీటిని అందించారని, జగనన్న సంక్షేమం, విక్రమన్న అభివృద్ధిని ప్రజలకు తెలిపి 'విక్రమన్నకు ఓటు–అభివృద్ధికి చోటు' అనే నినాదంతో నేను సైతం కరపత్రాలను ప్రతి గడపకు తిరిగి అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.



సాగరంలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం